క్లుప్తంగా

రైతులు ఓటర్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలి

వెలుగోడు: వ్యవసాయ ప్రాథమిక సహకార పరపతి కేంద్రం (సొసైటీ)లో ఓటు హక్కు కలిగిన రైతులు తమ ఓటర్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని వెలుగోడు సొసైటీ సీఈఓ జంబులయ్య సూచించారు. ఓటు హక్కు కలిగిన రైతులు తమ ఆధార్‌కార్డు, మూడు పాస్ ఫొటోలు, సెల్ నంబర్‌తో పట్టణంలోని శంకర్‌రెడ్డి పెట్రోల్ బంకు పక్కన ఉన్న సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ లోగా తమ వివరాలను కార్యాలయంలో అందించాలని, లేకపోతే ఓటు హక్కును కోల్పోతారని హెచ్చరించారు. వివరాలకు సెల్ నంబర్. 6281821910ను సంప్రదించాలని సూచించారు.

13న పాఠశాలల పునఃప్రారంభం

కొత్తపల్లి: ఈ నెల 13న మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను పునఃప్రారంభిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీరాములు సోమవారం తెలిపారు. ఈనెల 12వ తేదిన ప్రారంభం కావాల్సి ఉండగా ఆ రోజు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న తరుణంలో ప్రారంభ తేదీని మార్చినట్లు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థన మేరకు ఉన్నతాధికారులు ఆదేశాలు పంపారని వివరించారు.


శివాలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామివారు

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో శివుడికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు వేకువజామున స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించి, పూలమాలలతో అలంకరించారు. అమ్మవారు పార్వతీమాతకు కుంకుమార్చన, విశేష పూజలు చేపట్టారు. సోమవారం కావడంతో పట్టణంలోని అన్ని శివాలయాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారికి పంచామృతాభిషేకాలు, హోమాలు చేపట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

మహానంది ఏఎస్ఐకి పదోన్నతి



పదోన్నతి పొందిన బాలచంద్రుడు

మహానంది: మహానంది పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న బాలచంద్రుడుకు ఎస్ఐగా పదోన్నతి లభించింది. సోమవారం పోలీసు ఉన్నత అధికారుల ఉత్తర్వులు జారీ చేశారు. గత రెండు సంవత్సరాలుగా మహానంది పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు పదోన్నతి రావడంతో సిబ్బంది అభినందించారు.

కుక్కల దాడిలో జింకపిల్లకు గాయాలు



జింకకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

మహానంది: శిరివెళ్ల మండలం గోవిందపల్లిలో వీధి కుక్కలు జింక పిల్లపై దాడి చేయడంతో గాయపడింది. విషయం తెలుసుకున్న పోలీసులు జింకను పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. చికిత్స నిమిత్తం అటవీశాఖ సిబ్బంది గాజులపల్లె పశు సంచార వాహనం దగ్గరకు తీసుకొచ్చి ఇంజక్షన్లు వేయించారు. జింక పిల్ల ఆరోగ్యం మెరుగుపడిన అనంతరం అడవిలో వదిలిపెడతామని కోటకొండ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామేశ్వరి తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల అలంకరణ

జూపాడుబంగ్లా: చంద్రబాబునాయుడు ఈనెల 12న అమరావతిలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను మూడు రోజుల పాటు రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించాలని జిల్లా ఉన్నతాధికారులు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో మండల స్థాయి అధికారులు ఆఘమేఘాల మీద ఎంపీడీఓ, వైకేపీ, ఎన్ఆర్ఈజీఎస్, తహసీల్దార్ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి ఆ ఫొటోలను జిల్లా ఉన్నతాధికారులకు పంపారు.

అక్రమ వెంచర్లు.. యథేచ్ఛగా విక్రయాలు

- గ్రామపంచాయతీ అనుమతి, ల్యాండ్ కన్వర్షన్ లేకుండా లేఅవుట్లు
- చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్న పంచాయతీ, రెవెన్యూ అధికారులు
- గ్రామపంచాయతీ ఆదాయానికి గండికొడ్తున్న వైనం



మండ్లెం బ్రహ్మంగారి మఠం వెనుక పొలంలో వేసిన లేఅవుటు

జూపాడుబంగ్లా: గ్రామపంచాయతీ, రెవెన్యూ అధికారుల అనుమతుల్లేకుండా అక్రమంగా లేఅవుట్లు వేసి యథేచ్ఛగా ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ల్యాండ్ కన్వర్షన్ లేకుండా, రెవెన్యూ, గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా పంటపొలాల్లో పాట్లు వేసి రియల్ దందా సాగిస్తున్నా పంచాయతీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమతున్నాయి.

సెంటు రూ.2.50లక్షల నుంచి రూ.3.50లక్షల వరకు విక్రయం

మండ్లెం గ్రామపంచాయతీ పరిధిలోని బ్రహ్మంగారి మఠం వెనుకనున్న సర్వేనెంబర్ 262/ఏ లోని 2.17ఎకరాల పొలంలో, రోడ్డు పక్కన హైవేను ఆనుకొని ఉన్న పొలాల్లో కొందరు రియల్ వ్యాపారులు ల్యాండ్ కన్వర్షన్, పంచాయతీ అనుమతుల్లేకుండా అక్రమంగా లేవుట్‌వేసి విక్రయాలు సాగిస్తున్నారు. సెంటు రూ.2.50లక్షల నుంచి రూ.3.50లక్షల వరకు విక్రయిస్తూ పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారు. వాస్తవానికి గ్రామ పంచాయతీకి నిర్ణీత రుసుమును చెల్లించి అనుమతి పొందిన తర్వాత ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అలాంటివేవి లేకుండా అక్రమంగా పంటపొలాల్లో లేఅవుటు వేసి యథేచ్ఛగా ప్లాట్లను విక్రయించి సొమ్ముచేసుకుంటూ వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్నారు.

లేఅవుట్లను పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

అక్రమ వెంచర్లపై తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్‌ను వివరణ కోరగా తాను వచ్చిన తర్వాత ఎవరికీ ఎలాంటి ల్యాండ్ కన్వర్షన్ అనుమతులు ఇవ్వలేదన్నారు. అక్రమంగా వేసిన లేఅవుట్లను పరిశీలించి సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్‌ను సంప్రదించగా ఎవరికీ ఎలాంటి పంచాయతీ అనుమతులు ఇవ్వలేదన్నారు. పరిశీలించి వెంటనే ప్లాట్లు వేసిన వ్యక్తులకు నోటీసులు జారీచేస్తామని తెలిపారు. గ్రామ వీఆర్వో ఈశ్వరయ్య వివరణ కోరగా ఎవరూ ప్లాట్లు వేయలేదని, నేను రోజూ చూస్తున్నా ఎవరూ ప్లాట్లు వేయలేదు, ప్లాట్లు వేసిన సర్వేనంబర్ ఎంతనే విషయం నాకు తెలియదు. రికార్డులు చూడాల్సి ఉంటుందని తెలిపారు.



తర్తూరు ఆర్చీకి సమీపంలో హైవేను ఆనుకొని వేసిన ప్లాట్లు

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



మిడుతూరులో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: 5 సంవత్సరాల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి కోరారు. సోమవారం మండలకేంద్రమైన మిడుతూరుతో పాటు అన్ని గ్రామాల్లో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతోపాటు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. గ్రామంలో చిన్నారులతో ర్యాలీ నిర్వహించి అంగన్ వాడీ కేంద్రాల ప్రాముఖ్యతను వివరించారు.

రైతుల సంక్షేమానికి కృషి చేశా



రాజీనామా పత్రాన్ని మార్కెట్‌యార్డు ఇన్‌చార్జ్ సెక్రటరీకి అందజేస్తున్న చైర్‌పర్సన్ షేక్ రహత్

నందికొట్కూరు: రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశానని మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ షేక్ రహత్ అన్నారు. సోమవారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని మార్కెట్‌యార్డు ఇన్‌చార్జ్ సెక్రటరీ రామచంద్రయ్యకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు చేయడం జరిగిందన్నారు. జగనన్న పాలనలో రైతులకు ఎంతో మేలు జరిగిందని చెప్పారు. రైతు భరోసా, పంటనష్ట పరిహారం రైతుల బ్యాంక్ ఖాతాలో బటన్ నొక్కి జమ చేశారని గుర్తు చేశారు. రైతులకు గ్రామంలోనే రైతు భరోసా కేంద్రం నిర్మించి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించిన ఘనత జగనన్నకే దక్కిందని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో మార్కెట్‌యార్డుగా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జబ్బార్, తదితరులు ఉన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంత శర్మ, ఆంజనేయ శర్మ, అర్చకులు మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార హారతులిచ్చి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువు చేశారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది.

పాఠ్య, నోట్ పుస్తకాలు మంజూరు



వివరాలు వెల్లడిస్తున్న ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి

జూపాడుబంగ్లా: 2024-25 విద్యాసంవత్సరానికిగాను మండలానికి పాఠ్య, నోట్ పుస్తకాలు మంజూరైనట్లు ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 1 నుంచి 10 వరకు 4,048 మంది విద్యార్థులున్నారన్నారు. వారిలో 6 నుంచి 10 వరకు 2,462 మంది విద్యార్థులుండగా 25,810 నోట్‌పుస్తకాలు మంజూరైనట్లు తెలిపారు. 1 నుంచి 10 వరకు 21,585 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా మొదటి విడతగా 4,481, రెండోవిడతగా 17,104 పుస్తకాలు మంజూరయ్యాయని చెప్పారు. వీటితో పాటు విద్యార్థులకు విద్యాకానుకగా ఇవ్వాల్సిన వాటిలో బ్యాగులు, యూనిఫాం, బూట్లు, డిక్షనరీలు మంజూరు కావాల్సి ఉందన్నారు.

ఈనెల 13న పాఠశాలలు పునఃప్రారంభం

ఈనెల 12న ప్రారంభం కావాల్సిన పాఠశాలలు చంద్రబాబునాయుడు సీఎంగా ప్రమాణస్వీకార కార్యక్రమం ఉన్నందున 13న ప్రారంభింపజేయాలని ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీచేసినట్లు ఎంఈఓ తెలిపారు. ఈ మేరకు 2024-25 ఏడాదికిగాను పాఠశాలలు ఈనెల 13న పునఃప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పాఠశాలలు ప్రారంభించిన మొదటి రోజు ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా విధులకు హాజరుకావటంతో పాటు సకాలంలో రావాలని సూచించారు.

కేసు నమోదు

మిడుతూరు: నందికొట్కూరు - ఓర్వకల్లు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్ మోహన్ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి ఓర్వకల్లు బస్సు వస్తుండగా చింతలపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని ఆకతాయిలు బస్సు అద్దానికి రాయితో కొట్టగా డ్రైవర్ వలి తలకు రక్త గాయమైంది. గాయమైన వలితో పాటు కండక్టర్ శేషన్న స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారన్నారు.

మోడల్ స్కూలులో సీట్లకు డిమాండ్



ఏపీ మోడల్ స్కూలులో ఇంటర్ ప్రవేశాల కోసం వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూలులో ప్రవేశాలకు విద్యార్థులు, వారి తల్లి దండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. సోమవారం ప్రవేశాలకు క్యూ కట్టారు. 6వ తరగతిలో 40 సీట్లకు ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం, వారికి ఎంపిక పరీక్ష నిర్వహించడం పూర్తయ్యింది. మెరిట్ ప్రకారం మార్కులు సాధించిన విద్యార్థులను మాత్రమే పాఠశాలలో చేర్చుకుంటున్నారు. అలాగే ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులలో చేరేందుకు విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో భాగంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలకు దీటుగా తీర్చి దిద్ది.. మౌళిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యకు బాటలు వేశారు. అంతే కాకుండా ఈ పాఠశాలలో 10వ తరగతిలో పసుపుల వరుణ్ 600 మార్కులకు 583 మార్కులు, ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో రేవతి 1000కి 926 మార్కులు, ఎంపీసీలో శశికళ 1000కి 914 మార్కులు, సీఈసీలో వెంకటశివ 1000కి 842 మార్కులు సాధించారు. అలాగే మొదటి సంవత్సరం బైపీసీలో మంజుల 418/440, ఎంపీసీలో సుస్మిత 443/470, సీఈసీలో శృతి 390/500లకు చొప్పున మార్కులు సాధించారు. విద్యాబోధనలో ప్రిన్సిపాల్ నాగరవీంద్ర చూపుతున్న శ్రద్ధ, సిబ్బంది మెరుగైన పని విధానంమే ఇందుకు కారణంగా చెబుతున్నారు.

మెగా డీఎస్సీ హామీ నెరవేర్చాలి

నంద్యాల(న్యూటౌన్): మెగా డీఎస్సీ హామీని నెరవేర్చాలని డీవైఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌కుమార్, మాజీ ఉపాధ్యక్షుడు నరసింహులు కోరారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో డీవైఎఫ్ఐ కార్యదర్శి శివ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఇందుకు ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వెంకట్ పాల్గొన్నారు.

7.8 మిల్లీమీటర్ల వర్షపాతం

జూపాడుబంగ్లా: ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 7.8 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని నందికొట్కూరులో అత్యధికంగా 13.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా కొత్తపల్లిలో 0.4 మిల్లీమీటర్ల వర్షం కురిసిందన్నారు. పాములపాడులో 12.2 ఎం.ఎం, జూపాడుబంగ్లాలో 7.8 ఎం.ఎం, పగిడ్యాలలో 1.0 ఎం.ఎం, వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. జూన్ మాసం ప్రారంభం నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో రైతులు ముమ్మరంగా ఖరీఫ్ పంటలను సాగుచేసుకుంటున్నారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావినూతల దుర్గాప్రసాద్, కార్యదర్శి భూపని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం కోర్టు ఆవరణలో ప్లకార్డులు ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేసి న్యాయవాదుల న్యాయమైన కోరికలను తీర్చాలని, స్టేషన్ బెయిల్‌ను రద్దు చేసి కోర్టులే బెయిల్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే కోర్టుల్లో ఖాళీగా ఉన్న జడ్జి పోస్టులను, సిబ్బంది కొరతను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరిరెడ్డి, శ్రీదేవి, అమర్నాథరెడ్డి, వెంకటేశ్వర్లు, పీడీహెచ్‌బాబు, రమణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, నగరి శ్రీనివాసులు, రాష్ట్ర అడహక్ కమిటీ సభ్యులు సాంబశివుడు కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన జీవో నంబరు 117ను తక్షణమే రద్దు చేయాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, వివిధ రకాల యాప్‌లను రద్దు చేసి ఉపాధ్యాయులను కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. మునిస్వామి, పుల్లయ్య, రవి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగంపల్లి సొసైటీ చైర్మన్ రాజీనామా



రాజీనామా పత్రాన్ని సొసైటీ సీఈఓకు అందిస్తున్న గౌరు జనార్దన్‌రెడ్డి

కొత్తపల్లి: మండల కేంద్రంలోని నాగంపల్లి సొసైటీ చైర్మన్ పదవికి గౌరు జనార్దన్‌రెడ్డి సోమవారం రాజీనామా చేశారు. రాజీనామ లేఖను సోమవారం సొసైటీ సీఈఓ కోటికి అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాగంపల్లి సొసైటీ ద్వారా అనతి కాలంలోనే రైతుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేశామన్నారు. మార్టిగేజ్ లోన్లద్వారా రూ.2.30 కోట్ల రుణాలను రైతులకు అందించామని చెప్పారు. అదేవిధంగా మండలంలో 9 గోడౌన్లను చైర్మన్‌గా భాద్యతలు చేపట్టిన సంవత్సర కాలంలోనే పూర్తి చేయించి రైతులు ధాన్యం నిల్వ ఉంచుకునేందుకు అందుబాటులోకి తీసుకవచ్చామన్నారు. గోడౌన్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో రూ.1.24కోట్లు ఖర్చు చేశామని, రైతుల అభివృద్ధికి కృషి చేసిన ప్రభుత్వం ఏదైన ఉందంటే కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే నన్నారు. చైర్మన్‌గా సేవలందించేందుకు అవకాశమిచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, శాప్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, నాగ ఎల్లయ్య, లింగారెడ్డి ఉన్నారు.

80బన్నూరు సొసైటీ పాలకవర్గం రాజీనామా

జూపాడుబంగ్లా: 80బన్నూరు సహకార సొసైటీ పాలకవర్గం రాజీనామా చేసినట్లు సొసైటీ సీఈఓ చంద్రశేఖర్‌గౌడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సహకార సొసైటీ చైర్మన్ వై.వెంకటరమణ, డైరెక్టర్లు సురేష్, ఖాజాహుసేన్ వారి పదవులకు రాజీనామా చేశారన్నారు. వారి రాజీనామా పత్రాలను ఆమోదం కోసం సహకార సొసైటీ జిల్లా అధికారులకు పంపించినట్లు తెలిపారు. జిల్లా అధికారులు ఆమోదం లభించగానే నూతన పాలకవర్గాన్ని నియమించుకునే వెసలుబాటు కలుగుతుందని వెల్లడించారు.

వికలాంగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

వెలుగోడు: అర్హత కలిగిన వికలాంగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు అబ్దుల్‌రౌఫ్ డిమాండు చేశారు. సోమవారం సంఘం నాయకులు ఇంతియాజ్, రహంతుల్లా ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ పాఠశాలలో వికలాంగుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జగనన్న గృహాలలో అర్హులైన వికలాంగులందరికీ ప్రభుత్వ గృహ నిర్మాణ శాఖ స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. వికలాంగులందరికీ అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని, వికలాంగురాలికి వివాహంతో సంబంధం లేకుండా ఒంటరిగా ఉన్న కుటుంబంగా పరిగణించి రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరారు. ప్రతి వికలాంగులకు స్కూటర్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు జాకీర్ హుస్సేన్, అమీర్ హంజా, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కె గంగాధర్ శెట్టి, టి రహంతుల్లా, సురుల్లా, రవిగౌడ్, మాలిక్, సుంకమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలో మందు బిళ్లలు



నిప్పు పెట్టిన మందులను చూపుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ స్వాములు



చెత్త కుప్పలో పడేసిన 2025 సంవత్సరం వరకు కాలం ఉన్న ట్యాబ్లెట్లు

పాములపాడు: స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం 2025 సంవత్సరం వరకు కాలం ఉన్న ట్యాబ్లెట్లు ఆసుపత్రి ఆవరణలోని చెత్త కుప్పలో దర్శనమిచ్చాయి. అంతే కాకుండా కొన్ని సిరప్‌లు సైతం ఉన్నాయి. వీటిని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ స్వాములు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కాలం చెల్లని మందులు సైతం చెత్తకుప్పల్లోకి చేరుతున్నాయని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పును కప్పిపుచ్చడానికి మందులకు నిప్పుపెట్టారని ఆరోపించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ సమయంలో మందులు పారవేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయం పై వైద్యాధికారిణి గులాబ్‌షాను వివరణ కోరగా ఎవరు పడేశారో తమకు తెలియదన్నారు. 104 సిబ్బందిని అడిగామని, వారు తాము పడేయలేదని సమాధానం ఇచ్చారన్నారు. కాలం చెల్లిన మందులను డంప్ యార్డులో పరావేయడం జరుగుతుంది. అయితే ఇంకా టైం ఉన్న ట్యాబ్లెట్లను పడేయడంపై విచారిస్తున్నామని చెప్పారు.

అలరించిన భజన కార్యక్రమం



భజన కార్యక్రమం నిర్వహిస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా సోమవారం ఎస్ పెద్దపుల్లమ్మ బృందం, మహానంది, నంద్యాల జిల్లా వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమములో వినాయక దేవగణేశ, శ్రీశైలం శివమయం, శివశివయనరాదా. మనసారా నిన్నే కొలచితిని, శ్రీమల్లికార్జున దయ చూపరా, శివనామమంత్రం, ఓం నమఃశివాయ, అమ్మపరమేశ్వరి, శంభో... శివ శంభో, శ్రీశైలం శివమయం తదితర భక్తిగీతాలు, అష్టకాలను ఎస్. పెద్దపుల్లమ్మ, ఎస్. రంగయ్య, ఆర్. ముకుందరావు, ఎం.ప్రతాప్, టి. నవీన్ కుమార్, రామేశ్వరరెడ్డి, తదితరులు ఆలపించారు.